క్లుప్తంగా

అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 2026వ విద్యా సంవత్సరానికి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, హిందీ, మ్యాథమెటిక్స్ కోర్సులు బోధించటానికి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26 సాయంత్రం 5గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలతను సంప్రదించాలని సూచించారు.

డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధిలోని ఓగ్లాపూర్ షైలానీబాబా దర్గా వద్ద ఉన్న పరకాల(బీ1) బాలుర మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సనా ఏజెన్సీ బాధ్యుడు హస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కేయు క్రాస్‌రోడ్డులోని ఏజెన్సీలో లేదా 0870 – 3558539 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ స్కూల్ విద్యార్థిని



హసన్‌పర్తి: బాసరలోని ట్రిపుల్ ఐటీకి హసన్‌పర్తి మండల కేంద్రంలోని బాలికల పాఠశాల విద్యార్థిని ఆర్.హాస్యప్రియ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ పార్థసారథి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌గా కరుణాకర్ బాధ్యతల స్వీకరణ



రామన్నపేట: నగరంలోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కరుణాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2007వ సంవత్సరం ఎస్సై బ్యాచ్‌కు చెందిన కరుణాకర్.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్సైగా పనిచేశారు. ఇన్‌స్పెక్టర్‌గా ఇంటెలిజెన్స్, సైబర్ క్రైం విభాగాల్లో పనిచేయడంతో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హనుమకొండ, మహిళా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌కు స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ప్రభుత్వ ఐటీఐలో ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో శనివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలకు 70133 97132, దంత పరీక్షలకు 95333 54944 నంబర్లకు కాల్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

మెట్ల బావిలో విద్యుత్ లైట్లు మాయం



విద్యుత్ దీపాన్ని తొలగించిన ప్రదేశాన్ని చూపిస్తున్న స్థానికుడు అంజయ్య

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్ల బావిలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆకతాయిలే ఈ పని చేశారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి అయితే చాలు మెట్ల మార్గం ద్వారా బావిలోకి దిగి అర్ధరాత్రి వరకు కాలక్షేపం చేస్తున్నారని అంటున్నారు. విద్యుత్ దీపాలను తొలగిస్తే చీకట్లో ఉన్న తమను ఎవరూ చూడరని భావించి ఈ పనిచేశారని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో రాత్రి వేళల్లో మెట్ల బావి వద్ద పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు.

సీపీఐలో పలువురి చేరిక

న్యూశాయంపేట: బాలసముద్రంలోని అంబేద్కర్, జితేందర్ నగర్‌కు చెందిన సుమారు 100 కుటుంబాలు సీపీఐలో చేరాయి. ఈ సందర్భంగా వారికి హనుమకొండ పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి గురువారం రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కే.భిక్షపతి, కరుణాకర్, ఏ.శ్రీనివాస్, స్టాలిన్, టి.భిక్షపతి, ఎల్లేశ్, వెంకట్రాజం, సదానందం, రవి, సారంగపాణి, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దామిని.. మేఘ్‌దూత్.. కిసాన్ సువిధ

వాతావరణ సమాచార యాప్‌లతో రైతులు, ప్రజలకు ప్రయోజనం



దామిని యాప్



మేఘ్‌దూత్ యాప్



కిసాన్ సువిధ యాప్



వెదర్ అండ్ రాడర్ యాప్

కాజీపేట: వాతావరణం ఎప్పుడు, ఎలా మారుతుందో తెలియని పరిస్థితి. వర్షాలు కురుస్తాయన్న ఆశతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో మంది రైతులు విత్తనాలు విత్తుతూ వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండి రైతులు నష్టపోతున్నారు. అకాల, భారీ వర్షాలు సైతం పంటలను దెబ్బతీస్తూ కర్షకులకు నష్టం చేకూరుస్తున్నాయి. మరోవైపు పిడుగులు పడి కూడా ఉమ్మడి జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏయే ప్రాంతాల్లో వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంది.. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఎక్కడ ఉంది.. అనే తదితర సమాచారాన్ని ప్రజలు, రైతులు తెలుసుకోవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం దామిని, రెయిన్ అలారం, మేఘ్‌దూత్, కిసాన్ సువిధ వంటి యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటి ద్వారా వాతావరణ సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

నాలుగు రోజులు ముందుగానే..

మేఘ్‌దూత్ యాప్‌లో రానున్న నాలుగు రోజుల వాతావరణ సమాచారాన్ని ముందుగానే తెలుసుకోవచ్చు. వారం క్రితం నాటి సమాచారం కూడా అందుబాటులో ఉంటుంది. ఈ యాప్‌లో ప్రస్తుత సమయంలోని ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం తదితర సమాచారాన్ని పొందవచ్చు. వేరే చోటుకు ప్రయాణం చేసేవారు ఆ ప్రాంతాల వాతావరణ సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకోవచ్చు. ప్రమాదం నుంచి క్షేమంగా బయట పడవచ్చు.

పిడుగుల వేళ జాగ్రత్త..

ఉరుములు, మెరుపులు, పిడుగులకు సంబంధించిన సమాచారాన్ని దామిని యాప్ తెలియజేస్తుంది. పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో కూడా ఈ యాప్ సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు దామినిలో అందుబాటులో ఉన్నాయి. పిడుగు వేసినప్పుడు చేయాల్సిన, చేయకూడని పనులను కూడా వివరించారు.

వర్షాలపై నిరంతర సమాచారం..

వివిధ ప్రాంతాల్లోని వర్ష సూచనను నిరంతరం తెలుసుకునేందుకు రెయిన్ అలారం యాప్ ఉపయోగపడుతుంది. కిసాన్ సువిధ యాప్ ద్వారా వాతావరణ వివరాలతో పాటు అయిదు రోజుల ముందస్తు హెచ్చరికలను మార్కెట్ ధరలు, బీమా సమాచారం, విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణపై పలు సూచనలు సైతం కిసాన్ సువిధ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఎంతో సదుద్దేశంతో రూపొందించిన వాతావరణ యాప్‌ల సేవలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి. పంటల సాగు ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారికి వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అందుతుంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన కిసాన్ సువిధ యాప్ తెలుగు సహా పలు భాషల్లో అందుబాటులో ఉంది.

– సంతోష్, ఏఓ, కాజీపేట

మైనార్టీ గురుకులంలో తనిఖీలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి డాక్టర్ కేఏ.గౌస్ హైదర్ ఈ నెలలోనే రెండు సార్లు తనిఖీ చేశారు. ఈనెల 10వ తేదీన సందర్శించిన ఆయన తిరిగి గురువారం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి స్టోర్‌రూం, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వార్డెన్ మహమూద్ రహీం, రాజయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న గౌస్‌హైదర్

నాణ్యమైన పెట్రోల్ సరఫరా లక్ష్యం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు, తదితరులు

ఖిలా వరంగల్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వరంగల్ డివిజన్ ద్వారా నాణ్యమైన పెట్రోల్ సరఫరా చేసి వినియోగదారుల అనుబంధాన్ని మెరుగుపర్చుకోవడమే ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ శరత్‌బాబు అన్నారు. ఈ మేరకు వరంగల్ నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో పెట్రోల్ ధమాకా బహుమతుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 24 నుంచి ఆగస్టు 23 వరకు వరంగల్ డివిజన్ పరిధిలోని ఎంపిక చేసిన 100 పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ కొనుగోలు చేసే 2 వీలర్, 4 వీలర్ వాహన వినియోగదారులకు కూపన్ల ద్వారా తక్షణ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతీవారం లక్కీడ్రాలు, చివరిలో బంపర్ డ్రాలో మోటార్ సైకిల్ బహుమతిగా ఇవ్వనున్నట్లు వివరించారు. ఉత్తమ పనితీరు కనబరిచే కస్టమర్ సర్వీస్ అటెండెంట్లకు ప్రత్యేకంగా ఐటీసీఎల్ బ్యాక్ ప్యాక్‌లతో సన్మానించనున్నట్లు తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దేవాలయాల భూములను కాపాడాలి

హన్మకొండ కల్చరల్: దేవాలయాల భూములను కాపాడాలని వరంగల్ బట్టలబజార్‌లోని బాలా వేంకటేశ్వరస్వామి దేవాలయ స్థానాచార్యుడు పరాశరం కృష్ణమాచార్యులు, పూర్వ అర్చకుడు పరాశరం నరసింహాచార్యులు కోరారు. ఈ మేరకు దేవాలయానికి సంబంధించిన భూమిలో ఉన్న తమ ఇంటికి మూడు నెలల క్రితం దేవాదాయశాఖ అధికారులు తాళం వేయడంతో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. దాంతో దేవాదాయ శాఖ అధికారులను మందలిస్తూ తక్షణమే తాళాలు తొలగించాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు దేవాలయంలో వంశపారపర్యంగా పనిచేస్తున్న అర్చకులకు ఆ ఇంటిని దేవాదాయశాఖ అధికారులు గురువారం అప్పగించారు. అన్యాక్రాంతమైన ఇదే దేవాలయానికి చెందిన ఐదెకరాల స్థలాన్ని అధికారులకు కాపాడాలని అర్చకులు సూచించారు.



తాళం తీస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

విద్యార్థులకు డ్రాయింగ్ షీట్ల పంపిణీ



డ్రాయింగ్ షీట్లు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యారణ్యపురి: శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ షీట్లను హనుమకొండలోని విద్యాప్రేరణ ఫౌండేషన్ బాధ్యులు గురువారం అందజేశారు. ఈ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వలంటీర్‌ను నియమించారు. శిక్షకుడు కొండ భాస్కర్ వారానికి రెండు రోజులు విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. చిత్రలేఖనంలో నైపుణ్యం పెంపొందించుకుంటే గణితం, జియోగ్రఫీ, సైన్స్‌లో రాణించవచ్చని విద్యాప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పార్టీ నాయకులు



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో భారీ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను నగర వ్యాప్తంగా పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి, మొక్కలు నాటారు. – సాక్షి నెట్‌వర్క్

లలితాదేవికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో లలితాదేవి

ఖిలా వరంగల్: ఆషాఢం అమావాస్య సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో లలితాదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర చార్యులు, ఆలయాభివృద్ధి కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో లలితాదేవి అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేసి పుష్పాభిషేకం చేశారు.

చౌడేశ్వరి మాత జయంతి



శాకంబరీ అలంకరణలో అమ్మవారు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో దేవాంగ కులసంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి మాత జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి నందీశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి, చౌడేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలు, పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మఠం రాజేష్‌కుమార్, కులసంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వవీణ కవితా సంపుటి రచయితకు సన్మానం



వెంకటయ్యను సన్మానిస్తున్న జంగా, తదితరులు

మడికొండ: విశ్వవీణ కవితా సంపుటిని కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన రచయిత, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది వెంకటయ్య గౌడ్ రచించారు. ఈ మేరకు రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని టేకులగూడెంలోని ఆయన నివాసంలో గురువారం కలిసి ఆ కవితా సంపుటిని అందించారు. ఈ సందర్భంగా వెంకటయ్యను జంగా రాఘవరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, తరాలపల్లి మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, రాజు, బాబు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

ఖిలా వరంగల్: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ మృతికి సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌లోని రఘునాథ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య, నలిగంటి రత్నమాల, బైరపాక భవాని, వెంకటలక్ష్మి, రాధమ్మ, సదన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

రైలులో బాలుడి మృతదేహం లభ్యం

కాజీపేట రూరల్: హడప్సర్ – కాజీపేటకు చేరుకున్న హడప్సర్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో గుర్తు తెలియని బాలుడి మృతదేహాన్ని కాజీపేట జీఆర్పీ పోలీసులు గురువారం గుర్తించారు. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం హడప్సర్ ఎక్స్‌ప్రెస్ వెనుక జనరల్ బోగిలో సుమారు 12 ఏళ్ల గుర్తు తెలియని బాలుడు సీటుపై అనుమానాస్పదంగా మృతి చెంది ఉండగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఓంకార్ వివరించారు. మరిన్ని వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ లేదా 87125 76424 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.



గుర్తు తెలియని బాలుడి మృతదేహం

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

కాజీపేట రూరల్: మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సి.చటర్జీ అన్నారు. రైళ్లలో మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై రైల్వే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకొని జులై 1 నుంచి 30వ తేదీ వరకు అన్ని రైల్వే స్టేషన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో షేర్ స్వచ్ఛంద సంస్థ యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాట్‌ఫాంలు, రైళ్లలో ప్రయాణిస్తున్న వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ తోట శిరీష మాట్లాడుతూ రైళ్లలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 1098 లేదా 1800–1027222 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ వెంకన్న, కమిటీ సోషల్ మొబిలైజర్ జ్ఞానేశ్వరి, జమున, చామంతి, జగన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించింది

- నాపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు
- ఐఎంఏ హాల్‌లో సమావేశంలో ఐనవోలు తహసీల్దార్ విక్రమ్

రామన్నపేట: గత ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించిందని, నిజాయితీ, నిబద్ధతతో ఉద్యోగం చేస్తున్న తమపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తహసీల్దార్లు పేర్కొన్నారు. వరంగల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ మాట్లాడుతూ తనపై ఎలాంటి అవినీతి, ఆరోపణలు లేవని స్పష్టం చేశారు. నిరాధారమైన ఆరోపణలతో కొంత మంది తనను మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి స్థానంలో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురావడంతో తమపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఎలాంటి ఫిర్యాదు చేయాలనుకున్నా కలెక్టర్‌కు చేయవచ్చని అన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, కె.విక్రమ్‌కుమార్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్లు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట బాధ్యులు డిమాండ్ చేశారు. మొదటి దశ పోరాటాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మండల తహసీల్దార్లకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు కాజీపేట తహసీల్దారు భావ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. జీఓ నంబర్ 25ను సవరించి ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టీచర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్, సమగ్రశిక్ష, కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని, మోడల్ స్కూళ్లు, గురుకుల సిబ్బందికి 010 పద్దుకింద వేతనాలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు చంచుకాల లింగారావు, సదానందం, థామ్, పరమేష్, డీటీఎఫ్ మండల బాధ్యుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మండిబజార్ రహదారిపై మురుగునీరు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని మండిబజార్ మద్రాసీ మసీదు వద్ద ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. అండర్ డ్రెయినేజీ జామ్ కావడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దాంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోనే పెద్ద ప్రార్థనా మందిరం (మసీదు) ఉండటంతో నమాజ్‌కు వచ్చే వాళ్లు ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యమైన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దుర్వాసనతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు నీరు

గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరవేయాలి

హసన్‌పర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో పార్టీ మండల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ముందస్తు ప్రణాళిక, సమగ్ర కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీటీసీలు పిట్టల కుమారస్వామి, పెద్ది మహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఫ్లెక్సీల ఏర్పాటు

- విగ్రహాలను కమ్మేస్తున్న వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరువు

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో బాటసారులను ఆకర్షించడం కోసం ఏర్పాటు చేసిన విగ్రహాలకు అడ్డంగా కొంతమంది ఫ్లెక్సీలు కడుతూ కనిపించకుండా చేస్తున్నారు. చౌరస్తాకు సమీపంలో రైల్వే జంక్షన్ ఉందని ప్రయాణికులు, ప్రజలకు అర్థమయ్యేలా చక్కటి విగ్రహాలను కుడా, మున్సిపల్ శాఖల అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. పండుగలు, పబ్బాలు, నాయకుల జయంతులు, వర్ధంతులు వస్తే చాలు పెద్దపెద్ద ఫ్లెక్సీలను ఈ బొమ్మలకు అడ్డంగా కట్టేస్తున్నారు. దీంతో జిల్లాకు వచ్చే పర్యాటకులతో పాటు ప్రజలను అలరించడానికి ఏర్పాటు చేసిన ప్రయాణికుల బొమ్మలు ఎవరికి కనిపించని పరిస్థితి. అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పోటీపడి ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండడం చర్చనీయంశంగా మారింది. ఈ బొమ్మల ముందు నుంచే నిత్యం సంబంధిత అధికారులు రోజూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ పట్టించుకునే వారు లేరు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు కడితే జరిమానా విధిస్తామంటూ ప్రకటించే అధికారులు.. వాటిని చూసి కూడా చూడనట్లుగా మిన్నకుండిపోతుండడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాజీపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ